చంద్రబాబు విశాఖ రాక రేపు



విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'రా...కదలిరా..' పేరుతో విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఈనెల పదో తేదీన నిర్వహించనున్న బహిరంగసభకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. బుధవారం ఉదయం గన్నవరం నుంచి బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఆయన ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో బొబ్బిలి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. బొబ్బిలి సభ అనంతరం హెలికాప్టర్‌లో కాకినాడ జిల్లా తుని సమీపంలోని చామవరం సభలో పాల్గొంటారు.



చింతపల్లిలో కురుస్తున్న మంచు

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

యథావిధిగా కొనసాగుతున్న చలి తీవ్రత

పాడేరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. శీతల గాలులు వీస్తుండడంతో మంచు ప్రభావం కొద్దిగా తగ్గింది. కానీ చలి తీవ్రత మాత్రం కొనసాగుతున్నది. సోమవారం జీకేవీధిలో అత్యల్పంగా 10.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చింతపల్లిలో 11, పాడేరులో 11.8, అరకులోయలో 11.9, జి.మాడుగులలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉదయం తొమ్మిది గంటల వరకు పొగ మంచు వీడడం లేదు. విజిబిలిటీ తగ్గిపోవడంతో వాహనాలకు హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కాగా సాయంత్రం మూడు గంటల నుంచే చలితీవ్రత పెరుగుతున్నది.

సాగునీటిపై నిర్లక్ష్యం!

ఐదేళ్లుగా నిర్వహణ, మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యామ్‌లు

పంట కాలువల్లో పేరుకుపోయిన పూడిక

టీడీపీ హయాంలో ఏటా రూ.25 కోట్లతో పనులు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి కూడా మంజూరు చేయని వైనం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో గిరిజన రైతులకు సాగునీటి సదుపాయాల కల్పనపై వైసీపీ ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఏజెన్సీలో 80 వేల మందికిపైగా గిరిజనులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, వారి భూములకు నీటి వసతి కల్పించకపోవడంతో పంటల సాగు దైవాధీనంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో సాగునీటి రంగానికి కనీస నిధులు కేటాయించకపోవడం గిరిజన రైతుల పట్ల ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధిని వెల్లడిస్తున్నది. ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 1,566 చిన్న తరహా సాగునీటి (చెక్ డ్యామ్‌లు) వనరులు ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం వీటి కింద 66 వేల ఎకరాల ఆయకట్టు వుంది. చెక్ డ్యామ్ నిర్వహణను ఏళ్లతరబడి గాలికొదిలేయడంతో శిథిలావస్థకు చేరి ఛిద్రం అయ్యాయి. ఎగువ నుంచి వచ్చిన నీరు వచ్చినట్టుగానే కిందకుపోతున్నది తప్ప కాలువల ద్వారా పంటపొలాలకు చేరడం లేదు.

టీడీపీ హయాంలో ఏటా రూ.25 కోట్లతో పనులు

తెలుగుదేశం ప్రభుత్వ హయంలో ఏజెన్సీలో చిన్నతరహా సాగునీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం, నీరు- చెట్టు పథకం ద్వారా ఏటా రూ.25 కోట్ల విలువకు తగ్గకుండా వివిధ పనులు చేపట్టేవారు. ప్రధానంగా చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నుంచి పంట భూములకు నీరు చేరేందుకు కాలువల తవ్వకం, అప్పటికే వున్న కాలువల్లో పూడికతీత వంటి పనులు చేపట్టారు. సుమారు ఐదేళ్ల క్రితం అధికారంలోకి వైసీపీ... నాటి నుంచి చిన్నతరహా సాగునీటి పారుదల శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సాగునీటి వనరులు నిర్వహణ, మరమ్మతులు, పునర్నిర్మాణ పనులకు నిధుల కోసం ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా ఈ శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారులను ఇతర పనులకు.. అంటే నిర్మాణంలో వున్న ప్రభుత్వ భవనాల పరిశీలనకు వినియోగించుకున్నారు.



మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా వున్న డుంబ్రిగుడ మండలం కొర్రా గ్రామంలోని చెక్‌డ్యామ్

ఇదిలావుండగా ఏజెన్సీలో సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే పరిస్థితులు లేవని గుర్తించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అవకాశం వున్న మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేసుకునే వెసులబాటు కల్పిస్తున్నారు. అయితే ఏజెన్సీలో అత్యధిక శాతం చెక్ డ్యామ్‌లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారడంతో ఉపాధి నిధులతో పదో వంతు చెక్ డ్యామ్‌లు కూడా బాగుపడే పరిస్థితి లేదంటున్నారు. మన్యంలో సాగునీటి వనరులపై వైసీపీ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని గిరిజన రైతులు మండిపడుతున్నారు.

సాగునీటికన్నా ఇతర పనులకు ప్రాధాన్యం!

వైసీపీ ప్రభుత్వం గతంలో నిర్వహించిన గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. వీటిల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలతోపాటు సాగునీటి వనరులు కూడా వున్నాయి. ఈ కార్యక్రమం పూర్తయిన తరువాత ప్రభుత్వం ఒక్కో సచివాలయం పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ విధంగా ఏజెన్సీలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సుమారు రూ.40 కోట్లు మంజరయ్యాయి. ఈ నిధులను మెటల్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కేటాయించారు తప్ప, సాగునీటి వనరుల మరమ్మతులు, కాలువల్లో పూడికతీత పనులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో గిరిజన రైతులు ఐదేళ్ల నుంచి కేవలం వర్షాధారంగానే వ్యవసాయాన్ని చేయాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది.



సాగునీటి సదుపాయం లేక బీడుగా మారిన పంట పొలాలు

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

పార్టీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం



మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మూడో జాబితాలో పేరు ఉంటుందంటున్న ఆయన అనుయాయులు

- వాస్తవానికి ఎలమంచిలి లేదా చోడవరం నుంచి పోటీకి ఆసక్తి చూపిన మంత్రి
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు ససేమిరా అనడంతో పెందుర్తి వైపు చూపు
- సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలకలం



పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టిసారించింది. ఇప్పటికే రెండు విడతలుగా 38 మందిని ప్రకటించింది. తాజాగా మరో 22 మందితో మూడో విడత జాబితా విడుదల చేయబోతున్నట్టు పార్టీలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. అందులో పెందుర్తి నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరును ఖరారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇది సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వర్గీయుల్లో కలవరం రేపుతోంది.

వైసీపీ నెల రోజుల కిందట తొలివిడత 11 మందితో ఒక జాబితా విడుదల చేసింది. గాజువాక నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని, ఆయన కుమారుడు దేవన్‌రెడ్డిని కాకుండా 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును సమన్వయకర్తగా నియమించింది. కొద్దిరోజుల కిందట 27 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పాయకరావుపేట టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు కాకుండా విజయనగరం జిల్లా రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులుకు కేటాయించింది. తాజాగా మరో 22 మంది అభ్యర్థులతో మూడో జాబితాను సిద్ధం చేసినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మూడో జాబితాలో పెందుర్తి అభ్యర్థిగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు ప్రకటించడం ఖాయమని అంటున్నారు. ఈ మేరకు రెండు రోజుల కిందటే అధిష్ఠానం నుంచి ... మిగతా 8వ పేజీలో

షోకాజ్ నోటీసులు దహనం



షోకాజ్ నోటీసులను దహనం చేస్తున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు

పాడేరురూరల్, జనవరి 8: ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ 20 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు... సోమవారం విద్యా శాఖాధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసులపై మండిపడుతున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనీల్‌కుమార్, జయరాజ్ మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నో వినతులు, ఆందోళనలు చేపట్టిన పట్టించుకోకపోవడంతో సమ్మె చేయాల్సి వచ్చిందని అన్నారు. అనంతరం షోకాజ్ నోటీసులను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.సుందరరావు, యూనియన్ నాయకులు పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరు ఉధృతం

రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. ప్రభుత్వం బెట్టు వీడి, మెట్టు దిగి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అంగన్‌వాడీలు హెచ్చరించారు. సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసన శిబిరాల వద్ద ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు లొంగేదిలేదని స్పష్టం చేశారు. గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చితేనే సమ్మెను విరమిస్తామని ముక్తకంఠంతో చెప్పారు.



ముంచంగిపుట్టులో ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

టీడీపీ గెలుపే లక్ష్యం

అరకు ఇన్‌చార్జి దొన్నుదొరకు అందరూ సహకరించాలి

పార్టీ పరిశీలకుడు దువ్వారపు రామారావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

అరకులోయ, జనవరి 8: తెలుగుదేశం పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో అరకులోయ నుంచి పోటీ చేయనున్న సియ్యారి దొన్నుదొర గెలుపునకు అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ, టీడీపీ పరిశీలకుడు దువ్వారపు రామారావు కోరారు. సోమవారం పద్మాపురం సమీపంలోని ఒక ప్రైవేటు రిసార్టు ప్రాంగణంలో టీడీపీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన దువ్వారపు రామారావు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన పార్టీల కూటమి ఘన విజయం సాధించి, అధికారంలోకి రావడం ఖాయమని, అందువల్ల అరకులోయలో కూడా పార్టీ అభ్యర్థి విజయం కోసం అందరూ ఐకమత్యంతో పనిచేయాలని కోరారు. సామాజిక సమీకరణలతోపాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే పార్టీ అధిష్ఠానం సియ్యారి దొన్నుదొరను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించిందని ఆయన చెప్పారు. విభేదాలకు, వర్గాలకు తావులేకుండా వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా ... మిగతా 8వ పేజీలో

అరకులోయకు శ్రీరాముని పూజిత అక్షితలు

పట్టణంలో వైభవంగా శోభాయాత్ర

పెద్ద సంఖ్యలో పాల్గొన్న రామభక్తులు

అక్షితలు పంపిణీ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

అరకులోయ, జనవరి 8: అయోధ్య శ్రీరాముని పూజిత అక్షితలతో సోమవారం అరకులోయలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. రామభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జై శ్రీరామ్ జైజై శ్రీరామ్' అంటూ నినదించారు. అంతకు ముందు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో పూజిత అక్షింతలను స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలగణేశ్, భానుగణేశ్, సునీల్‌కార్తిక్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల నుంచి వచ్చిన రామభక్తులు పూజిత అక్షితలతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అక్షితలను మండలంలోని వివిధ గ్రామాల్లో వున్న ... మిగతా 8వ పేజీలో



శ్రీరాముని పూజిత అక్షితలను అరకులోయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత



పూజిత అక్షితలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

చాపరాయి జలపాతం పునఃప్రారంభం

రూ.60 లక్షలతో పలు అభివృద్ధి పనులు



చాపరాయి జలపాతాన్ని పునఃప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే ఫాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు

డుంబ్రిగుడ, జనవరి 8: అభివృద్ధి పనుల అనంతరం ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే ఫాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్ సంయుక్తంగా సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ, మన్యం అందాలు ప్రపంచానికి తెలిసేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చాపరాయి జలపాతాన్ని రూ.60 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. ముఖద్వారం నుంచి జలపాతం వరకు మెట్ల మార్గాన్ని నిర్మించామని, జలపాతాన్ని సందర్శించే పర్యాటకులు ఇక్కడే భోజనాలు చేయడానికి తాగునీటి సౌకర్యంతో కల్పించామన్నారు. జలపాతంలో సరదాగా ... మిగతా 8వ పేజీలో



ప్రయాణికులతో రద్దీగా వున్న ఆర్టీసీ కాంప్లెక్స్

ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులు.. ఇళ్లకు వెళ్లడానికి బస్సులు, జీపులు, ఆటోలను ఆశ్రయించిన విద్యార్థులు

పాడేరురూరల్, జనవరి 8: విద్యా సంస్థలకు ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి పండగ సెలవులు ప్రకటించడంతో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు సోమవారం ఇళ్లకు బయలుదేరారు. పదేళ్ల లోపు పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు వచ్చారు. దుస్తులు, పుస్తకాల బ్యాగులతో వసతిగృహాల నుంచి బయలుదేరి సొంతూళ్లకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు, ఆటోలు, జీపులను ఆశ్రయించారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యార్థులు బస్సుల్లో వెళ్లడానికి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. దీంతో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీగా మారింది. బస్సు వస్తేచాలు.. ఎక్కడానికి ఎగబడుతున్నారు. కాగా సరిపడ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు.



బస్సులో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



గొర్లె ప్రసాద్ (ఫైల్)

అచ్యుతాపురం, జనవరి 8: అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో బజాజ్ షోరూమ్ ఎదురుగా సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. పరవాడ మండలం గొర్లెవానిపాలెంకి చెందిన గొర్లె ప్రసాద్ (35) పదేళ్లుగా ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఫోటోగ్రఫీ పనిపై అచ్యుతాపురం వచ్చి తిరిగి స్వగ్రామం స్కూటీపై వెళ్తుండగా అచ్యుతాపురం ప్రధాన కూడలి దాటిన వెంటనే బజాజ్ షోరూమ్ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ముందుభాగం స్కూటీకి తగిలింది. దీంతో స్కూటీ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంతో లారీ ముందు చక్రం ప్రసాద్ తల పైనుంచి వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రసాద్‌కి ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులతో పాటు ఒక చెల్లి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

కంటైనర్ బోల్తా



బోల్తాపడిన కంటైనర్



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

- ధ్వంసమైన ఆటో
- స్వల్పగాయాలతో బయటపడిన లారీ డ్రైవర్

పరవాడ, జనవరి 8 : స్థానిక మండల పరిషత్ జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం భారీ కంటైనర్ బోల్తా పడింది. రహదారి పక్కనే ఆగి ఉన్న ఆటో ధ్వంసమైంది. ఆటోలో ఉన్న డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం సెజ్ నుంచి బ్రిక్స్ లోడ్‌తో కంటైనర్ విశాఖ పోర్టుకు బయలుదేరింది. లారీ మండలపరిషత్ కూడలి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ప్రయాణికుల కోసం ఆటో రహదారి పక్కనే నిలిచి ఉంది. ఆటోలో ఉన్న డ్రైవర్ శ్రీరామ్మూర్తి ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకున్నాడు. కంటైనర్ .. ఆటోపై పడడంతో ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ రాము తలకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సింహాచలంనాయుడు(ఫైల్)

సబ్బవరం, జనవరి 8: సబ్బవరం కొత్తరోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంకు చెందిన రొంగలి సింహాచలంనాయుడు (59) కాకినాడ ఓఎన్‌జీసీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం సబ్బవరం సంతకు నడుచుకుంటూ వెళుతు న్నాడు. కొత్తరోడ్డు వద్దకు వచ్చినపుటికీ పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న స్కూటీ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో సింహాచలంనాయుడు రోడ్డుపై పడిపోయాడు, దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు కుమారుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కొత్తూరులో చోరీ

- రూ.లక్ష నగదు, పది తులాల వెండి అపహరణ



నేర స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహనరావు

అనకాపల్లి టౌన్, జనవరి 8: పట్టణానికి సమీపంలోని కొత్తూరులో ఒక ఇంట్లో దొంగలు పడి రూ. లక్ష నగదు, పది తులాల వెండి వస్తువులు అపహరించినట్టు పట్టణ ఎస్ఐ సింహాచలం తెలిపారు. కొత్తూరు గ్రామంలోని నగిరెడ్డి లక్ష్మి అనే మహిళ తన కుమార్తెను చూసేందుకు శనివారం మామిడిపాలెం వెళ్లింది. సోమవారం కింద పోర్షన్‌లోని ఒక వ్యక్తి మేడపైన బట్టలు ఆరబెట్టేందుకు వెళ్తుండగా లక్ష్మి ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉండడంతో ఆమెకు సమాచారం అందజేశారు. ఆమె ఇంటికి వచ్చి చూడగా బీరువాను పగులగొట్టి లోపల ఉన్న లక్ష రూపాయల నగదు, పది తులాల వెండి వస్తువులు అగంతకులు అపహరించుకుపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే పట్టణ సీఐ దాడి మోహనరావు, సీసీఎస్ సీఐ నీలయ్య, ఎస్ఐలు రమేష్, సింహాచలం నేర స్థలాన్ని పరిశీలించారు. అలాగే క్లూస్ విభాగం కూడా నేరస్థలాన్ని పరిశీలించి, అగంతకుల వేలిముద్రలను సేకరించారు. పట్టణ ఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ దగ్ధం



మంటల్లో ఉన్న టిప్పర్ లారీ

అనకాపల్లి టౌన్, జనవరి 8 : జాతీయ రహదారిలోని డైట్ కళాశాల సమీపంలో ఆదివారం అర్ధరాత్రి టిప్పర్ అగ్నికి ఆహుతైంది. అచ్చెయ్యపేటకు చెందిన టిప్పర్ డ్రైవర్ ఉరిగిటి శ్రీనివాసరావు రాత్రి సమయంలో గ్రావెల్ లోడుతో డైట్ కళాశాల సమీపంలో గ్రావెల్‌లోడ్ అన్‌లోడ్ చేశాడు. వెనక్కి వెళుతున్న సమయంలో టిప్పర్ లిఫ్ట్ ఓపెన్ అయిపోవడంతో విద్యుత్‌వైర్లకు తగిలి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి నరసింగరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్తినష్టం రూ.ఎనిమిది లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. డ్రైవర్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

100 లీటర్ల సారా, 15 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాయకరావుపేట, జనవరి 8 : పట్టణంలో రెండు చోట్ల దాడులు నిర్వహించి 100 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లల పులుసు, 15 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. తమకు అందిన సమాచారం మేరకు దుర్గానగర్ కాలనీని ఆనుకుని దారకొండ వద్ద సారా బట్టిని గుర్తించామన్నారు. అక్కడ ఎనిమిది ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న సుమారు వంద లీటర్ల సారాతోపాటు 800 లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. అలాగే పట్టణంలోని జీవీఆర్ ఆర్చి వద్ద పుణ్యమంతుల రాంబాబు వద్ద 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	65.00
లైవ్ ధర	85.00
విత్ స్కిన్	140.00
స్కిన్ లెస్	150.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 8: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్, జేసీ, డీఆర్‌వో తదితరులు 485 మంది వద్ద వినతులు స్వీకరించారు. అర్జీదారుల గోడును స్వయంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆలకించారు. సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు అర్జీలను బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా అర్జీలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు వాటి పరిష్కారంలో దృష్టి సారించాలన్నారు. ఇదిలా ఉండగా కలెక్టరేట్ ఎదుట తమకు పింఛన్లు పెంచాలంటూ దివ్యాంగులు ఆందోళన నిర్వహించారు. వీరి వద్దకు డీఆర్‌వో దయానిధి వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పనిచేయాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పనిచేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి ఫిర్యాదుల పై తీసుకున్న చర్యలు గురించి నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందన ముగిసే సరికి 57 అర్జీలు అందగా అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఎస్ఐ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రేంజ్‌లో 28 మంది సీఐల బదిలీ

- విశాఖకు పది మంది రాక
- ఇక్కడ నుంచి ఎనిమిది మంది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు...
- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న వారికి స్థానచలనం
- సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్న ఐజీ

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో 28 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు రోజుల క్రితం 20 మందిని బదిలీ చేసిన ఆయన...ఈ పర్యాయం మరో 28 మందికి స్థాన చలనం కల్పించారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న సీఐలను మార్చారు. ఇంకా సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. తాజా బదిలీల్లో విశాఖ రేంజ్‌లో వేకెన్సీ రిజర్వు ఉన్న, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న పది మందిని విశాఖ నగరానికి, నగరం నుంచి ఎనిమిది మందిని ఇతర ప్రాంతాలకు పంపుతూ ఆదేశాలు ఇచ్చారు. వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు జి.దుర్గాప్రసాద్, ఎస్.విద్యాసాగర్, సీహెచ్ ప్రసాద్, టి.సీతారామ్, సీహెచ్ శ్రీనివాసరావు, పి.శోభన్‌బాబును విశాఖ నగరానికి కేటాయించారు. అలాగే పి.రంగనాథాన్ని విజయనగరం ట్రాఫిక్‌కు, పీవీ జగన్నాథరాజును విజయనగరం జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. విజయనగరం రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సీఐ ఆర్‌ఈసీహెచ్ ప్రసాద్, శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లాలో వేకెన్సీ రిజర్వులో ఉన్న ఎస్.రామకృష్ణను విశాఖ నగరానికి కేటాయించారు. ఇక విశాఖ నగరంలో పనిచేస్తున్న బి.రమణమూర్తిని శ్రీకాకుళం జిల్లా వేకెన్సీ రిజర్వుకు, కె.రామారావును విజయనగరం రెండో పట్టణ సీఐగా, జి. సోమశేఖరాన్ని శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, జి.ఉమా మహేశ్వరావును శ్రీకాకుళం టూటౌన్ సీఐగా, జి.నిర్మలను శ్రీకాకుళం డీటీసీకి, కె.అశోక్‌కుమార్‌ను విజయనగరం ట్రాఫిక్ సెల్‌కు, టీవీ విజయకుమార్‌ను విజయనగరం జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, ఎం. అప్పారావును పార్వతీపురం మన్యం జిల్లా సీసీఎస్‌కు, బీఎండీ ప్రసాద్‌ను పార్వతీపురం మన్యం సోషల్ మీడియా సెల్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సీఐ టి.ఇమ్మాన్యుయల్ రాజును ఇచ్ఛాపురం సీఐగా నియమించి, ఆయన స్థానంలో అక్కడి డీసీఆర్‌బీ సీఐ సీహెచ్ సూరినాయుడుకు పోస్టింగ్ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా పరవాడ సీఐ పి.ఈశ్వరరావును శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ సీఐగా నియమించి, అక్కడ పని చేస్తున్న జి.శంకరరావును అనకాపల్లి టౌన్ సీఐగా, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ టి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, విజయనగరం రెండో పట్టణ సీఐ ఎన్‌హెచ్‌వీ ఆనంద్‌ను కాశీబుగ్గ పట్టణ యూపీఎస్‌కు, అక్కడ పని చేస్తున్న డి.నవీన్‌కుమార్‌ను పాడేరు యూపీఎస్ సీఐగా పోస్టింగ్ ఇస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు.

ఉపాధ్యాయుల ముందస్తు అరెస్టు

- నేడు, రేపు విజయవాడలో నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకుంటున్న ప్రభుత్వం
- జిల్లాలో 24 మందికి 151 నోటీసులు



అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ ఉన్నతపాఠశాలలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శికి నోటీసు అందించి, అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్

అనకాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మంగళ, బుధవారాల్లో నిర్వహించ తలపెట్టిన ధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు వెళ్లకుండా ప్రభుత్వం కట్టడి చేస్తోంది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉపాధ్యాయుల సమాఖ్య ఈ ధర్నాకు పిలుపు ఇచ్చింది. అయితే ఆ కార్యక్రమానికి ఉపాధ్యాయులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి సోమవారం అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ పాఠశాలలో విధుల్లో ఉండగా చోడవరం పోలీసులు 151 నోటీస్ చేతిలో పెట్టారు. అనంతరం అరెస్టు చేసి చోడవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో వేర్వేరు మండలాల్లో 24 మంది ఉపాధ్యాయులకు 151 నోటీసులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులను గృహ నిర్బంధం చేశారు. ఉపాధ్యాయులు తమ సమస్యలపై ధర్నా చేసేందుకు విజయవాడ వెళుతుంటే పోలీసులతో అడ్డుకోవడాన్ని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి ఒక ప్రకటనలో ఖండించారు.



గొలుగొండలో మహిళా ఉపాధ్యాయినికి నోటీసు అందజేస్తున్న కానిస్టేబుల్

జోన్‌లో 113 అద్దె బస్సులకు ప్రతిపాదనలు

- సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం
- పీటీడీ ఈడీ రవికుమార్



ఈడీ రవికుమార్

అనకాపల్లి టౌన్, జనవరి 8 : పీటీడీ జోన్ పరిధిలో 113 కొత్త అద్దె బస్సులకు ప్రతిపాదనలు పంపినట్టు పీటీడీ ఈడీ సీహెచ్. రవికుమార్ చెప్పారు. సోమవారం ఆయన అనకాపల్లి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక్క అనకాపల్లి జిల్లాకే 27 బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని హైద్రాబాద్, తిరుపతి, కడప, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం లేదని, సాధారణ చార్జీలతోనే బస్సుల్లో ప్రయాణించవచ్చనని స్పష్టం చేశారు. పీటీడీ కార్గో ఆదాయం కూడా బాగుందని తెలిపారు. జోన్‌లో గతేడాది (2022-23)లో రూ.15కోట్ల90 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది డిసెంబరు వరకు రూ.18.55 కోట్లు ఆదాయం లభించిందన్నారు. మార్చి నాటికి రూ.మరో 10 కోట్లు ఆదాయం వచ్చే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి డిపోలో గతేడాది రూ.29.69 కోట్లు ఆదాయం రాగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి రూ.33.43 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. నర్సీపట్నం డిపోకి గతేడాది రూ.33.36 కోట్లు, ఈ ఏడాది రూ.35.97 కోట్లు ఆదాయం లభించిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది శుభకార్యాలు ఎక్కువగా ఉండ డంతో ఆదాయం పెరిగిందన్నారు. తమకు అందిన వినతుల మేరకు అనకాపల్లి నుంచి కాకినాడకు సర్వీసు నడిపేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. పీటీడీ నూతనంగా 1500 బస్సులు కొనుగోలు చేసిందని, వాటిలో జోన్‌కు 200 వరకు వస్తాయని భావిస్తున్నట్టు ఈడీ రవికుమార్ చెప్పారు. విలేకరుల సమావేశంలో డీపీటీవో కె. పద్మావతి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని వరహానదిలో గాలింపు

- సూసైడ్ లెటర్ ఉండడంతో అప్రమత్తమైన పోలీసులు
- సాయంత్రం వరకు గాలించినా లభ్యంకాని ఆచూకీ
- సీసీ పుటేజీలో తుని వైపు నడిచి వెళ్లినట్టు గుర్తింపు



ధర్మవరం అగ్రహారం వద్ద వరహానదిలో గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యం

ఎస్. రాయవరం, జనవరి 8: మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద సోమవారం ఉదయం వరహానదిలో దూకి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానంతో పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద వరహానది బ్రిడ్జిపై ఎస్. రాయవరానికి చెందిన ఉల్లి మణికంఠ అనే వ్యక్తి పేరుతో సూసైడ్ లెటర్, ఓ బ్యాగ్, చెప్పులు ఉండడంతో వాటిని గమనించిన స్థానికులు నదిలో దూకి ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడేమో అన్న అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ప్రసాదరావు ఆ ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. గజ ఈతగాళ్లు నదిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లేదు. ఈ విషయాన్ని టీవీలు, వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో మణికంఠ భార్య భూలక్ష్మి తెలుసుకొని వరహానది బ్రిడ్జి వద్దకు చేరుకొంది. అయితే ఎంత వెతికినా మణికంఠ ఆచూకీ లేకపోవడంతో ఎస్ఐ అక్కడికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఆ వ్యక్తి తన చెప్పులు, బ్యాగ్, లెటర్‌తో పాటు సెల్‌ఫోన్ బ్రిడ్జి వద్ద ఉంచి, నదిలో దూకకుండా తుని వైపు నడిచి వెళుతూ కనిపించాడని ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు. అయితే మణికంఠ గతంలో బెట్టింగ్‌లు, యాప్‌లోన్స్ ద్వారా అప్పులపాలయ్యాడని, అప్పుల వలన గతంలో ఇంటిలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు అతడి భార్య భూలక్ష్మి చెప్పినట్టు పోలీసులు తెలిపారు. మణకంఠ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు.

25 మద్యం సీసాలతో ముగ్గురిపై కేసు

ఎలమంచిలి, జనవరి 8: పట్టణంతో పాటు మండల పరిధి ములకలాపల్లి గ్రామ శివారులో మూడు వేర్వేరు చోట్ల 25 మద్యం సీసాలతో ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. ములకలాపల్లి శివారున పైడిరాజు వద్ద 9, పట్టణంలోని బస్టాండ్ వద తురంగల పాలెంకు చెందిన ఎ.సత్యనారాయణ వద్ద 7 , ఎన్.వెంకటరమణ వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నట్టు ఆయన చెప్పారు. వీరి ముగ్గురిపైన కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

జూడో క్రీడా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

తుమ్మపాల(అనకాపల్లి), జనవరి 8 : జిల్లా జూడో క్రీడా సంఘం నూతన కార్యవర్గం ఎన్ని క సోమవారం కోడూరులో జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లా జూడో క్రీడా సంఘం అధ్యక్షుడు డాక్టర్ ప్రాద్రంగి రుక్మాకరరావు నేతృ త్వంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్య క్షుడిగా వనం సన్యాసిరావు, ఉపా ధ్యక్షుడిగా గొట్టాపు బలరాంనాయుడు, కార్యదర్శిగా రాకోటి సిమ్యోనూ, ఉప కార్యదర్శిగా సేనాపతి ప్రసాద్, కోశాధికారిగా గొరపల్లి దేవి వరలక్ష్మి, ఉప కోశాధికారిగా యల్లబిల్లి రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో యువత జూడోపై ఆసక్తి నెలకొల్పేందుకు కార్యవర్గమంతా కృషి చేస్తామని తీర్మానం చేశారు.

అభిజిత్ కర్మాగారంలో చర్చలు సఫలం

- కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తిస్థాయిలో పనులు చేయడానికి అంగీకారం

అచ్యుతాపురం, జనవరి 8: అభిజిత్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించడానికి యాజమాన్యం అంగీకరించడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి కార్మికులు విధులకు హాజరయ్యారు. కర్మాగారం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్న నెపంతో కాంట్రాక్ట్ కార్మికులకు 15 రోజులే పనులు కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించింది. పూర్తి స్థాయిలో పనులు కల్పించాలంటూ కార్మికులు వారం రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. వీరికి వైసీపీ తప్ప మిగిలి టీడీపీ, జనసేన, సీఐటీయూలు మద్దతు తెలిపాయి. దీంతో దిగివచ్చిన కర్మాగారం యాజమాన్యం సోమవారం చర్చలు జరిపి గతంలో వలే నిరంతరాయంగా పనులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీంతో కార్మికులు సోమవారం సాయంత్రం నుంచి విధులకు హాజరయారు. ఈచర్చల్లో టీడపీ నుంచి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నుంచి సుందరపు విజయకుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, అచ్యుతాపురం, జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, నాయుడు, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కారు పక్కన మహిళ మృతదేహం

- మరొకరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, జనవరి 8 : మండలంలోని పోతిరెడ్డి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి పది గంటల సమయంలో కారు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరొకరి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ద్విచక్రవాహనదారుడికి గాయాలైనట్టు తెలిసింది. స్థానికుల కథనం మేరకు తుని నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మరో వ్యక్తికి గాయాలు కావడంతో అనకాపల్లి ఆస్పత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. దీంతో హైవేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదం గురించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్ర హాకీ టోర్నీకి జిల్లా జట్టు పయనం



రాష్ట్ర హాకీ టోర్నీకి పయనమైన జిల్లా హాకీ జట్టు క్రీడాకారులు

ఎలమంచిలి, జనవరి 8 : తిరుపతిలో ఈనెల 9వ తేదీ నుంచి రెండు రోజులు పాటు జరిగే ఏపీ 14వ రాష్ట్ర హాకీ టోర్నమెంటుకు అనకాపల్లి జిల్లా జట్టు సోమవారం బయలుదేరి వెళ్లినట్టు హాకీ అసోసియేషన్ ప్రతినిధి ఏబీఎల్ రాజు తెలిపారు. జిల్లా జట్టులో ఆర్ఎంఎస్.దత్తాత్రేయ, స్వరూప్ కుమార్, ఎ.వెంకటేష్, టి.నాగ గణేష్, బంగారు గణేష్, కొటారు తేజ, సీహెచ్.చరణ్, ఎం.వెంకటేష్, జె.భాను ప్రసాద్, పి. జగదీష్, కె.మహేష్, బి.రామ్‌చరణ్, స్వామి, జి.రాజ్‌కుమార్, కె.మనోజ్, ఎస్.ప్రణీత్, పి. భరత్, కె.సూర్య గణేష్ ఉన్నారన్నారు. జట్టు మేనేజరుగా మళ్ల రూపేష్ వ్యవహరిస్తారన్నారు. క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు జి.రాంబాబు, నరసింగరావు అభినందించారు.

'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం అగమ్యగోచరం'

అనకాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం అగమ్యగోచరంగా తయారైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. రైతు ద్రోహి జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో సాగనంపేందుకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో రైతు సంఘ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదని, అనకాపల్లి జిల్లా వరకు రైతులకు తీరని నష్టం కలిగించారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టలేదన్నారు. సుజల స్రవంతి ప్రాజెక్ట్ శిలఫలకానికే పరిమితమైందన్నారు. విలేకర్ల సమావేశంలో ఆక్కిరెడ్డి రమణబాబు, రొంగలి సూరిబాబు, కడిమిశెట్టి నరసింగరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చోడవరానికి పతకాల పంట

- రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన ముగ్గురు క్రీడాకారులు
- మూడు విభాగాల్లో సత్తాచాటిన పరుగుల బామ్మ లక్ష్మి
- రాణించిన వెంకట రమణమూర్తి, చినబాబు



పతకాలు సాధించిన లక్ష్మి, వెంకట రమణమూర్తి, చినబాబు

చోడవరం, జనవరి 8 : పరుగుల బామ్మగా పేరొందిన చోడవరానికి చెందిన ముత్యం లక్ష్మి రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట పండించారు. ఆమెతో పాటు, పట్టణానికి చెందిన వెటరన్ క్రీడాకారులు పోటు వెంకటరమణమూర్తి, వి.చినబాబులు సైతం తమ సత్తాచాటారు. విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించిన ఈ పోటీల్లో ముత్యం లక్ష్మి, 85 ఏళ్ల కేటగిరీలో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానాల్లో నిలిచి మూడు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. అలాగే, స్థానిక వాకర్ క్లబ్ సభ్యులు రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పోటు వెంకట రమణమూర్తి 65 ఏళ్ల కేటగిరీలో నాలుగు వందలు, ఎనిమిది వందలు, పదిహేను వందల మీటర్ల పరుగు పందెం పోటీల్లో మూడు బంగారు పతకాలు దక్కించుకున్నారు. అదేవిధంగా రిటైర్డ్ హెచ్ఎం వి.చినబాబు రెండు వందల మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం సాధించారు. వెటరన్ క్రీడల్లో ఈ ముగ్గురూ సత్తాచాటడంతో ఈ ప్రాంత క్రీడాకారులు, క్రీడాభిమానులు, వాకర్స్‌క్లబ్ సభ్యులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

నిరుద్యోగులను మోసగించిన వైసీపీ ప్రభుత్వం

టీడీపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్

పాడేరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా మోసగించిందని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రతీ ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్, ఆ దిశగా కనీసం చర్యలు చేపట్టలేదన్నారు. ఎన్నికల్లో గెలవాలనే ఆశతోనే నిరుద్యోగులకు మాయమాటలు చెప్పారని, వారికి న్యాయం చేయాలనే ఆలోచననే జగన్‌ను లేదని ఆయన ఆరోపించారు. చంద్రబాబునాయుడు పాలనలో నిరుద్యోగులకు న్యాయం చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గానికి మేలు జరగలేదని, నిరుద్యోగులకు పరిస్థితి ఇలా ఉంటే, సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం ద్వారా రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. అలాగే పేదల కోసం టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను సైతం లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో ఏం జరుగుతుందో ప్రజల గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని శ్రావణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

ఏపీని సంక్షోభ రాష్ట్రంగా మార్చిన జగన్

» రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో కూల్చేశారు: టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జనవరి 8: సంక్షేమంగా ఉండే ఆంధ్రప్రదేశ్‌ను ఒక్క ఛాన్స్ అంటూ వేడుకుని అధికారంలోకి వచ్చిన జగన్ సంక్షోభ రాష్ట్రంగా మార్చారని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం కుమ్మరిపుట్టులోని తన నివాస గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారం చేపట్టాక ప్రజావేదికను కూలగొట్టడంతో పాలన మొదలు పెట్టి జగన్, క్రమంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో కూల్చేశారని ఆరోపించారు. వైసీపీకి అధికారం ఇస్తే నాలుగున్నరేళ్లలోనే రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రివర్స్ టెండర్ పేరుతో ఇరిగేషన్‌ను నాశనం చేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువస్తే, జగన్ వచ్చాక మాఫియా, టెర్రరిజాన్ని తేవడంతో పాటు గంజాయి కేసుల్లో యువకులు ఇరుక్కొనేలా చేసి భవిష్యత్‌ను బుగ్గిపాలు చేశారన్నారు. పన్నుల బాదుడుతో ప్రజల రక్తాన్ని జలగలా పీల్చుతున్నారన్నారు. పథకాల పేరుతో ప్రజలకు రూ.10 ఇచ్చి రూ.100 లాగడమే జలగన్న పాలసీ, స్పెషాలిటీ అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని వేడుకుంటూ సమ్మెలు చేపట్టిన చిరుద్యోగులపై షోకాజ్ నోటీసులు, ఎస్మా ప్రయోగించి భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేలను మార్చడం కాదు జగన్‌నే మార్చాలన్నారు.

గుడివాడలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ

మండల కేంద్రంలోని గుడివాడ గ్రామంలో బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి మహిళలు పూలదండలు వేసి హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన తొలి మేనిఫెస్టోను ప్రజలకు గిడ్డి ఈశ్వరి వివరించారు. ఇంతవరకు ప్రజలు పడుతున్న బాధలు, కష్టాలు తొలగిపోవాలంటే చంద్రన్న సీఎం కావాలని పేర్కొన్నారు. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో కుటుంబాలను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కేవీ.సురేష్‌కుమార్, డి.వెంకటరమణ, వి.కొండలరావు, గబ్బాడ సింహాచలం, కొంతెలి వెంకటప్రసాద్, గొడబ లక్ష్మి, పలాసి బాబూరావు, కె.సుబ్బారావు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్ బాగుచేసుకుందాం..: నారాయణ

వైసీపీ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించి భవిష్యత్‌ను బాగుచేసుకోవడానికి ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి చంద్రబాబును గెలిపించుకోవాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు రాజమండ్రి నారాయణ పిలుపునిచ్చారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ ఆధ్వర్యంలో చింతలవీధి పంచాయతీ పరిధిలోని తలారిసింగి గ్రామంలో సోమవారం భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ఆయన వివరించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ మరోసారి జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్ర పరిస్థితి భయంకరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత ఎస్.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



కొత్తభల్లుగుడలో జన్‌మన్ ఏర్పాట్లను అధికారులతో పరిశీలిస్తున్న పీవో అభిషేక్

'జన్‌మన్'ను విజయవంతం చేయండి

» ఐటీడీఏ పీవో అభిషేక్ » కొత్తభల్లుగుడలో ఏర్పాట్లు పరిశీలన

అరకులోయ, జనవరి 8: జన్‌మన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తభల్లుగుడలో ఈ నెల 15న నిర్వహించనున్న జన్‌మన్ కార్యక్రమం ఏర్పాట్లను అధికారులతో కలిసి కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జన్‌మన్ సర్వేలో ఇల్లు లేని వారిని గుర్తించి మంజూరు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. అర్హులైన ఆదివాసీలకు ఆయుష్మాన్‌భారత్ కార్డులు, కుల ధ్రువీకరణపత్రాలు, మంచినీటి కుళాయిలు, విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణపై ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావులకు పీవో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, డీఎల్‌పీవో కుమార్, పీఆర్ ఈఈ కొండయ్యపడాల్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, ఐసీడీఎస్, వెలుగు, గిరిజన సంక్షేమ, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆదుకుంటాం: ఏఎస్పీ ధీరజ్



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల, జనవరి 8: మన్యంలోని గిరిజన విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పాడేరు ఏఎస్పీ ధీరజ్ చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ మెటీరియల్, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మండలంలోని సుమారు 200 మంది పదో తరగతి విద్యార్థులకు దుస్తులు అందించామన్నారు. అలాగే ప్రత్యేక దస్తూరి కోసం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక భోజన, ఉచిత రవాణా వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ ఓసీ ఉదయ్, సీఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగినికి ఘన సత్కారం





అతిథిని సత్కరిస్తున్న సహచర ఉద్యోగులు... విజయవాడలో చంటి బిడ్డతో రోడ్డుపై బైఠాయించిన అతిథి (ఫైల్ ఫొటో)

పాడేరు రూరల్, జనవరి 8: డిమాండ్ల సాధనకు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన ముంచంగిపుట్టు మండలంలోని కేజీబీవీ కంప్యూటర్ ఆపరేటర్ అతిథి అలియాస్ సరోజనిని సోమవారం ఘనంగా సత్కరించారు. పాడేరులోని సమ్మె శిబిరంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఈ కార్యక్రమం చేపట్టారు. సమ్మెలో భాగంగా ఈ నెల 5వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో ఎస్‌పీడీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టే సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులను బస్సులో పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో అతిథి ఏమాత్రం భయపడకుండా తన చంటి బిడ్డతో బస్సుకు అడ్డంగా కూర్చొన్నారు. దీంతో సోమవారం ఆమెను జిల్లా నాయకులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పనిచేయాలన్నారు. పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వాస్తవంగా ఈ నెల 15వ తేదీలోపు నియోజకవర్గంలో అన్ని కుటుంబాలను కలిసి, ఈ పథకాల గురించి వివరించాల్సి వుందని, కానీ ఇప్పటివరకు పది శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. వెంటనే రంగంలోకి దిగి మిగిలిన 90 శాతం ఇళ్లకు వెళ్లి ప్రచారం చేపట్టాలన్నారు. పార్టీ అధిష్ఠానం విధించిన లక్ష్యాలను క్లస్టర్, యునిట్, బూత్ ఇన్‌చార్జిలు పూర్తిచేయాలని చెప్పారు. వీరందరినీ సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని నియోజకవర్గం ఇన్‌చార్జికి సూచించారు. అనంతరం ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ, అందరినీ కలుపుకుపోతూ వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో విజయఢంకా మోగించి అధినేత చంద్రబాబుకు బహుమానంగా ఇద్దామని అన్నారు. అనంతరం డుంబ్రిగుడ మాజీ ఎంపీపీ దన్నేరావు, హుకుంపేట, అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల టీడీపీ అధ్యక్షులు బాబురావు, తులసీరావు, సుబ్బారావు, సీకరి సుకుమారి, కిల్లో బలరామ్, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ, వంతల నాగేశ్వరరావు తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి దొన్నుదొర అందరినీ కలుపుకుపోవాలని, వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు శెట్టి లక్ష్మణుడు, సర్పంచులు దాసుబాబు, శ్రీనివాసరావు, జన్ని అప్పారావు, సత్యనారాయణ, సన్నమ్మ, రామయ్య, కోడ శివశంకర్‌రావు, లకే అశోక్, జనపరెడ్డి లక్ష్మీదేముడు, కొర్రా తౌడమ్మ, సీతారామ్, ఎంపీటీసీలు బోంజుబాబు, అచ్చమ్మ అప్పారావు, సోమెల జానకి, బూర్జ లక్ష్మి, బోరి లక్ష్మి, ద్రౌపదిఇ, సూర్యకాంతం, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి కేంద్ర పథకాలు దోహదం

» బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్

» కె.కోడాపల్లి, కుంబిడిసింగిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్... హాజరైన అధికారులు, నాయకులు

జి.మాడుగుల, జనవరి 8: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని కె.కోడాపల్లి, కుంబిడిసింగి పంచాయతీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేవలం కేంద్ర పథకాలతో దేశంలో ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో పీఎంజీఎస్‌వై రోడ్లు, వనబంధ కల్యాణ యోజన, పీఎం జన్‌మన్ యోజన, కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం, మెడికల్ కళాశాల, జాతీయ రహదారి, ఉచిత రేషన్, ఉజ్వల్ ఉచిత గ్యాస్ పథకం, జాతీయ ఉపాధి హామీ పథకం, ఏకలవ్య ఆశ్రమ పాఠశాలలు, పీఎం కిసాన్, తదితర పథకాలతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే అధికారులు ఆయా పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి మోదీ జాతినుద్దేశించి ప్రసంగించే వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. బీజేపీ నాయకులు పీవీఎన్.మాధవ్, సురేంద్రమోహన్, కూడా కృష్ణారావు, కురసా ఉమామహేశ్వరరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, బీజేపీ నేతలు సల్లా రామకృష్ణ, కురసా రాజారావు, పి.రవి కుమార్, చిరంజీవి, నూకరాజు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న రమేశ్

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మను బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం.రమేష్ సోమవారం దర్శించుకున్నారు. ఈ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు అతన్ని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, బీజేపీ నేతలు కురసా ఉమామహేశ్వరరావు, సల్లా రామకృష్ణ, కూడా కృష్ణారావు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చినా ఉద్యమం ఆగదు

» అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి

» మన్యంలో కొనసాగుతున్న సమ్మె.. నిరసనలు



పాడేరు: సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

పాడేరు రూరల్/చింతపల్లి/ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ, జనవరి 8: న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ 28 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్ వాడీలను అధికారులు తొలగించినా భయపడేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం సమ్మె శిబిరం వద్దకు సీడీపీవో ఝాన్సీ సూపర్‌వైజర్లతో వచ్చి అంగన్‌వాడీలు 9వ తేదీ నుంచి విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామని హెచ్చరిస్తూ ఉత్తర్వులను అందించే ప్రయత్నం చేశారు. అయితే ఉద్యోగాలు ఊడినా పరవాలేదని.. జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతే సమ్మెను విడిచిపెడతామని వారంతా ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. దీంతో చేసేదేమీ లేక తీసుకువచ్చిన నోటీసులను శిబిరం వద్ద అతికించి వెనుదిరిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.సుందరరావు మాట్లాడుతూ తన ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను బెదిరించి చెప్పు చేతల్లో ఉంచుకున్నట్టు, అంగన్వాడీలను బెదిరించాలని సీఎం జగన్ చూడడం దురదృష్టమన్నారు. జగన్‌లా మాట తప్పడం.. మడం తిప్పడం చిరుద్యోగుల జీవితాల్లో ఉండదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తీరుమార్చుకొని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నారి, జయ, భాగ్య, దేవి, అంబిక, సత్యవతి పాల్గొన్నారు. అలాగే చింతపల్లిలో అంగన్‌వాడీల శిబిరాన్ని టీడీపీ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. అలాగే వారికి అన్నదానం చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సిన వైసీపీ ప్రభుత్వం కార్యకర్తలను భయపెట్టి ఆందోళనలు విరమించేలా వ్యవస్థల ద్వారా ఒత్తిడికి గురి చేయడం సరికాదని టీడీపీ నేత రీమల ఆనందరావు అన్నారు. జగన్‌రెడ్డికి అహంకారం పెరిగిపోయిందని, మూడు నెలల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యాని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ్, టీడీపీ నాయకులు రీమల ఝాన్సీ, వరహాలమ్మ, కోరాబు స్వర్ణ, అనిల్‌కుమార్, ముత్యం సత్యనారాయణ, కొర్ర గోవిందు, సందాడ సాయి బాబు, యూనియన్ నాయకులు రాములమ్మ, సత్యవతి, పెంటమ్మ పాల్గొన్నారు. డుంబ్రిగుడలో చెవిలో పువ్వులు పెట్టుకుని సోమవారం అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షురాలు కొండమ్మ విలేకరులతో మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పక్షం రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఎస్మాను ప్రయోగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి సత్యావతి, నాయకులు నిర్మల, పవిత్ర పాల్గొన్నారు. ముంచంగిపుట్టు ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు సాయంత్రం వరకు నిరశన చేపట్టారు. దీక్షకు సీపీఎం, సీఐటీయూ గిరిజన సంఘాలు మద్దతు ఇచ్చాయి. దీక్షా శిబిరం ప్రాంగణంలో అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్మా చట్టం జీవో పత్రాలను తగలబెట్టారు. అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చకపోతే అన్ని పార్టీలు, సంఘాలను కలుపుకుంటూ ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎం.ఎం.శ్రీను, ఎస్.కాంతమ్మ, మంగ్లీ, కళ, పార్వతి, సుజాత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



చింతపల్లి: అంగన్‌వాడీలకు భోజనాలు పెడుతున్న టీడీపీ నాయకులు

బెదిరింపులు మానండి.. సమస్యలు పరిష్కరించండి

షోకాజ్ నోటీసులు దహనం చేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



అరకు రహదారిపై నోటీసులు దహనం చేస్తున్న ఉద్యోగులు, నేతలు

పాడేరు రూరల్/అరకులోయ, జనవరి 8: బెదిరింపులు మానుకుని సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, జయరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం షోకాజు నోటీసులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతోనే ఆకలితో అలమటిస్తూ 20 రోజులుగా సమ్మె చేస్తున్నామని చెప్పారు. అలాగే అరకులోయ కూడలిలో గిరిజన సంఘం, సీఐటీయూ, ఆదివాసీ కళాకారుల సంఘం నాయకులు షోకాజు నోటీసు ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వం తక్షణమే నోటీసులను వెనక్కి తీసుకోవాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఎల్.సుందరరావు, పి.సింహాచలం, బుజ్జిబాబు, జోషి తదితరులు పాల్గొన్నారు.

చాపరాయి జలపాతం పునఃప్రారంభం

... 5వ పేజీ తరువాయి

గడిపిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు నిర్మించినట్టు చెప్పారు. జలపాతంలో ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. చిన్నారులు ఆడుకోవడానికి ప్రత్యేకంగా ఆట పరికరాలను సమకూర్చామని చెప్పారు. చాపరాయి ప్రాంగణంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామని, దీనివల్ల చీకటి పడిన తరువాత కూడా పర్యాటకులు జలపాతాన్ని సందర్శించవచ్చన్నారు. జలపాతం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, డుంబ్రిగుడ ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్ వెంకటరావు, ఎంపీడీవో ఉషారాణి, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

... 5వ పేజీ తరువాయి

సంకేతాలు అందాయంటూ పేర్కొంటున్నారు. అయితే మంత్రి అమర్‌నాథ్ ఎలమంచిలి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపగా, అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కన్నబాబురాజు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకుండా వేరెవరికి ఇచ్చినా వారి ఓటమిని కృషిచేస్తానని పార్టీ ముఖ్య నేతలకు ఆయన తేల్చిచెప్పడంతో మంత్రి అమర్‌నాథ్ వెనకడుగు వేసినట్టు చెబుతున్నారు. రెండో ప్రాధాన్యంగా చోడవరం నుంచి పోటీకి మంత్రి అమర్‌నాథ్ ఆసక్తి చూపారు. తనను తొలగించి ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి సహకరిస్తానని, తన సామాజికవర్గానికి చెందిన మంత్రి అమర్‌నాథ్‌కు ఇస్తానంటే మాత్రం తాను అంగీకరించబోనని సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పార్టీలో కీలక నేతకు స్పష్టంచేసినట్టు చెబుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో పెందుర్తి నుంచి పోటీకి అనుమతించాలని మంత్రి అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరారంటున్నారు. గతంలో తన తాత అప్పన్న, తండ్రి గురునాథరావు కూడా పెందుర్తి నుంచే పోటీ చేసి గెలిచినందున తనకు అక్కడ నుంచి పోటీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌పై వ్యతిరేకత ఉందంటూ అతడిని మార్చే ప్రతిపాదన అధిష్ఠానం వద్ద ఉండడం..అమర్‌నాథ్‌కు కలిసొచ్చినట్టయిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా గుడివాడ అమర్‌నాథ్‌కు పెందుర్తి టికెట్ కేటాయించనున్నారనే ప్రచారం సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలవరం రేపుతోంది. మరి...అదీప్‌రాజ్‌ను ఎక్కడ నుంచి పోటీకి దింపుతారని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. ఆయన్ను కాకుండా వేరెవరినో తమపై రుద్దితే వారి విజయానికి తాము పనిచేసేది లేదని అంటున్నట్టు సమాచారం.

అరకులోయకు శ్రీరాముని పూజిత అక్షితలు

... 5వ పేజీ తరువాయి

హిందూ దేవాలయాల్లో దేవుళ్ల సన్నిధిలో ఉంచేందుకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు అప్పలరామ్, మింజు, పైడిరాజు, కాపుగంటి హరిబాబు, కృష్ణారావునాయుడు, సంతోశ్, అప్పలరాజు, బంగార్రాజు, రామరాజు, సహదేవ్, కమల, తదితరులు పాల్గొన్నారు.

పూజిత అక్షితలు పంపిణీ చేసిన పురందేశ్వరి

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత సోమవారం అరకులోయ వచ్చి వేంకటేశ్వస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య శ్రీరాముని పూజిత అక్షితలను రామభక్తులకు పంపిణీ చేశారు. కాగా రెండు రోజులపాటు బీజేపీ నేతలతో సమావేశాలు నిర్వహించడానికి ఇక్కడకు వచ్చినట్టు పురందేశ్వరి వెల్లడించారు.

☛ సంక్షిప్తంగా..

ఉద్యోగులపై నిర్బంధాన్ని ఆపాలి

» యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు

డుంబ్రిగుడ, జనవరి 8: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరాటం సాగిస్తున్న ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పోలీసుల నిర్బంధాన్ని ఆపాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీకి ముందు, తర్వాత మంజూరు చేసిన డీఏ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోన్లు, సరెండర్ లీవ్స్ చెల్లించాలన్నారు. వీటి కోసం దశల వారీగా మండల, జిల్లా స్థాయిలో పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర స్థాయిలో 36 గంటల ధర్నాలో పాల్గొంటున్న ఉపాధ్యాయులపై ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్బంధించడం తగదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్టు ఉపాధ్యాయుల అరెస్టుతో తేటతెల్లమైందన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా మంగళవారం జరిగే ధర్నాను విజయవంతం చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.

ఆదివాసీల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర

» ఆర్థిక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఉజ్వల

చింతపల్లి, జనవరి 8: ఆదివాసీలు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) ద్వారా గిట్టుబాటు ధరలు అందించనున్నట్టు ఆర్ఏఆర్ఎస్ ఆర్థిక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సీదరి ఉజ్వల అన్నారు. కొత్తపాలెం పంచాయతీలోని పినపాడు గ్రామంలో సోమవారం రైతులతో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు తమ ఉత్పత్తులను వ్యక్తిగతంగా విక్రయించుకుంటే సరైన మద్దతు ధర రాదన్నారు. రైతులందరూ ఒక సంఘంగా ఏర్పడి పంటలను విక్రయించుకోవడం వల్ల మంచి ధర లభిస్తుందన్నారు. ఎఫ్‌పీవోలు 400 మంది రైతులు సభ్యులు చేరడం శుభపరిణామన్నారు. పసుపు, కాఫీ, మిరియాలు, అల్లం, చిరుధాన్యాలు, రాజ్‌మా, వలిసెలు పంటలను ఎఫ్‌పీవో ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌పీవో పరిధి రైతులకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మార్కెటింగ్ సదుపాయంతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్రాలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శెట్టి బిందు, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏఆర్‌టీఎస్ సంస్థ ఎండీ అనుష్ పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

» జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, జనవరి 8: గిరిజన గ్రామాల్లో దశల వారీగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ గొడ్డిపుట్టు గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పనులు చేపడతామన్నారు. ప్రతీ గ్రామంలో విద్య, వైద్యం, రహదారి, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంపీపీ ఎ.సీతమ్మ, సర్పంచ్ వి.రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చేతకానప్పుడు హామీలు ఎందుకు ఇచ్చావు జగన్: గిరిజన సంఘం

ముంచంగిపుట్టు, జనవరి 8: అమలు చేయడం చేతకానప్పుడు ఎన్నిల ప్రచార సమయంలో సర్వ శిక్షా భియాన్, కేజీబీవీ ఉద్యోగులకు ఎందుకు హామీలు ఇచ్చావు జగన్ అంటూ గిరిజన సంఘం, సీఐటీయూ నాయకులు కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీను ప్రశ్నించారు. సర్వ శిక్ష అభియాన్, కేజీబీవీ ఉద్యోగులను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు-2 పత్రాలను ఆదివారం ఆయా సంఘాల నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వ శిక్ష, కేజీబీవీ ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందకోసం కొన్ని రోజులుగా సమ్మెకు దిగినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని వాపోయారు. సరికదా వారిని తొలగించేందుకు జీవోను జారీ చేయడం అన్యాయమని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని అయనఅన్నారు.

పచ్చనపల్లిలో ఇల్లు దగ్ధం

జి.మాడుగుల, జనవరి 8: గెమ్మెలి పంచాయతీలోని పచ్చనపల్లి గ్రామానికి చెందిన కూడా కోటేశ్వరరావు ఇల్లు దగ్ధమైంది. సోమవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇల్లు దగ్ధం కావడంతో పాటు ధాన్యం, బట్టలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

చింతపల్లి, జనవరి 8: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థినులకు ముగ్గులు, వంటల పోటీలు నిర్వహించగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపీనాథ్, ఉపాధ్యాయులు ఊలం వీరభద్రరావు పాల్గొన్నారు.

అన్నపై కత్తితో దాడి

గూడెంకొత్తవీధి, జనవరి 8: మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో అన్నపై తమ్ముడు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కంకిపాటి శ్రీను పడాల్, త్రిమూర్తులు చిన్నాన్న, పెద్దనాన్న పిల్లలు. సోమవారం తల్లిదండ్రులకు చెందిన భూముల విషయంలో అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. ఇద్దరి మధ్య గొడవ పెరగడంతో శ్రీను పడాల్ త్రిమూర్తులపై కత్తితో దాడి చేశాడు. దీంతో త్రిమూర్తులు చేతులు, తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు పెదవలస పీహెచ్‌సీకి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడే వైద్య సేవలు పొందుతున్నట్టు కుటుంబీకులు తెలిపారు.